వెంటనే గురువు తన శిష్యుడ్ని పిలిచి ఏదో చెప్పాడు. అతను కొద్ది క్షణాల్లో జేబులో పట్టే ఓ చిన్న అద్దాన్ని తెచ్చి ఆ వచ్చినతనికిచ్చాడు.

"దీన్ని సదా నీ దగ్గరుంచుకో. నీకు కోపం వచ్చినప్పుడల్లా దీన్ని బయటకి తీసి నీ మొహం అద్దంలో చూసుకో చాలు."

అతను కొద్ది రోజుల తర్వాత వచ్చి గురువు గారి ముందు సాష్టాంగపడి చెప్పాడు.

"స్వామీ. మీరు ఇచ్చిన అద్దం గొప్పగా పని చేస్తోంది. నేను కోపంగా ఉన్నప్పుడు నా మొహం ఎంత భీకరంగా మారుతుందో చూసినప్పుడల్లా నాకు ఎంతో సిగ్గు కలిగి కోపం మటుమాయమౌతోంది."

## 16. దేహ బంధం

"ఎవరది?" అలికిడి విని అడిగాడు గురువు.

"ఎవరని చెప్పను?" ప్రశ్నించాడు శిష్యుడు.

"ఆ చెప్పను వీలుకాని వస్తువే నువ్వు. ఇది మరవ్వద్దు." హెచ్చరించాడు గురువు.

"ఆ వస్తువు మేమని అనుకోవడం మాకు కష్టం. ఇక గుర్తెలా పెట్టుకోగలం? స్వామీ! ఈ దేహమే మేమనుకోవడం మాకు తేలిక." జవాబు చెప్పాడు శిష్యుడు.

"దేహమే నువ్వనుకునేంత కాలం నీకు రాగం, ద్వేషం ఉంటాయి. అవే కర్మబంధాలకి కారణాలు కాబట్టి కాలూ, చేయీ అవి చేసే పనులు అవి చేస్తూండనీ. నువ్వు కాలూ చేయీ కాదుగా? ఏ పనీ చేయక తటస్థంగా ఉండే వస్తువువి నువ్వు. అది తెలీనంతసేపే కష్టం. అది తెలుసుకుంటే ఇంక కష్టమనేదే వుండదు." వివరించాడు గురువు.